# యేసు, వారి పాదములు కడిగెను

# (13:1-17)

1983వ సంవత్సరం పురుషుల రిట్రీట్‌లో మాటలాడడానికి 13:1-17 అనే ఈ లేఖన భాగం నాకు యివ్వబడింది. పెద్ద డైనింగ్ హాలులో ప్రతి ఒక్కరు కూర్చున్నారు. పాఠాన్ని ప్రారంభించడానికి, ఉదాహరణకు నాతో సహకరించడానికి అంగీకరించిన మనిషి వద్దకు నేను ఒక పళ్లెములో నీళ్లు, తువాలు తీసికొని నడిచిపోయాను. (దీనికి నేను మరో వ్యక్తిని అడిగాను అది "చాల ఇబ్బంది కలిగిస్తుందని" అతడు అన్నాడు). గది నిశ్శబ్దముతో నిండియుంది. నేను అతని కాళ్ల వద్ద మోకరించి, సాక్సును షూను తీసివేసి అతని పాదాలను కడిగాను. ఆ సంఘటన ప్రతివారిని ఎలా స్తంభింపజేస్తుందో ముందుగా ఎదురు చూడలేదు – అది నన్ను కూడా ఏమి చేస్తుందో అనుకోలేదు! దాన్ని గూర్చి మనం చదివినా, విన్నా అది ప్రభువు తన శిష్యులకు చేసినట్టు మాట్లాడుకున్నా, వ్యక్తిగతంగా మనం చేసినప్పుడు అది సంకట కరంగా ఉంటుంది. తన జీవిత కాలపు చివరిలో, "ప్రభువు తన శిష్యుల కాళ్లు కడుగ నారంభించింది" (13:5) యిప్పటి కాలంలో సంకటంగా ఉంటుంది.

పస్కా పండుగకు కొంచెం ముందుగా (13:1),[1] ప్రభువు తన శిష్యులతో కూడ భోజనానికి కూర్చున్నాడు. ఆ రోజున బేతనియనుండి దుమ్ము రోడ్లమీద ప్రయాణం చేశారు. మరియు మార్గంలోని సంభాషణ వివాదంతో కూడినదైయుంది.[2] ఆ సాయంత్రపు వేళ భోజనానికి కూర్చున్నప్పుడు కాళ్లు కడుగుకొనకుండ వచ్చారు. నేలమీద కూర్చుండి మోచేతి మీద ఆనుకునే ఆ నాగరికతలో, నీకు తరువాత కూర్చుండే వాని కాళ్లు అసహ్యంగా ఉంటాయి! కడుగుకొనడానికి పళ్లెము, తువాలు లభ్యమౌతుంది, అయితే అసలు పని చేయడానికి సేవకుడెవడు అక్కడ లేడు. అందువలన, ఆ రోజు దుమ్ము యింకా వారి కాళ్లమీద ఉండగనే వారు భోజనానికి ఉపక్రమించారు. వారు భోజన పంక్తిని కూర్చుండగా, యేసు లేచి నడుముకు తువాలు ఒకటి కట్టుకొని, పళ్లెములో నీళ్లు పోసికొని తన శిష్యుల కాళ్లు కడిగి తువాలుతో వాటిని తుడువ నారంభించాడు. ఒక శిష్యుని వద్దనుండి మరొకని వద్దకు వెళ్లుతున్నప్పుడు సంకటకరమైన నిశ్శబ్దముతో ఆ గది నిండియుండవచ్చు. గదిలో అంతమంది ఉండగా, ప్రభువు మాత్రమే ప్రతివాని కాళ్లు ఎందుకు కడుగుతున్నాడు?

ఆ రాత్రివేళ తన కార్యంవలన మురికి కాళ్లు కడగడం కంటే ప్రభువు ఎక్కువైన దానిని జరిగిస్తున్నాడు. తన మరణం కొరకును, తమ పని కొరకును ఆయన వారిని సిద్ధపరచుతున్నాడు. సిలువపై త్వరలో ఆయన చేయబోయే త్యాగానికిని, తన రక్తంవలన సాధ్యపరచబడే ప్రక్షాళన (కడగబడడానికిని)కును, సంపూర్ణంగా దేవుని రాజ్యపు నూతన

విలువలకును యేసు తన శిష్యుల పాదాలను కడగడం ముందటి ఛాయగా ఉంది. క్రైస్తవ సేవ యొక్క స్వభావం ఎలాగుంటుందో ఉపదేశించడానికి ప్రభువు వారి కాళ్లు కడగడాన్ని భౌతికమైన ఉదాహరణగా ఉపయోగించుకొంటున్నాడు.

## సేవ అనేది ప్రేమను ప్రదర్శించునదై యుంది (13:1)

యోహాను సువార్తలో క్రొత్త భాగాన్ని 13వ అధ్యాయం ఆరంభిస్తుంది. 13–17 అధ్యాయాలను యేసు యొక్క "వీడ్కోలు చర్చలని" సాధారణంగా పిలువబడతాయి. గత పరిచర్యయందు బహిరంగ బోధ కేంద్రమై ఉంది. దానికి భిన్నంగా, ఈ భాగం ఆత్మీయంగా ప్రభువునకును అతని పన్నిద్దరికిని మధ్య జరిగిన సన్నిహిత సంభాషణతో కూడినదైయుంది. ఈ భాగంలో ఉన్న ఒక్క వ్యత్యాసమేమంటే – గతంలో కంటె "ప్రేమ" అనేది బహు తరచుగా వినియోగింపబడింది. 1వ అధ్యాయంనుండి 12వ అధ్యాయంవరకు ప్రేమకు ఆరు రిఫరెన్సులు మాత్రమే ఉన్నాయి. కాని 13నుండి 17 అధ్యాయములవరకు ముప్పై ఒక్క సార్లు అది ప్రస్తావించబడింది! వీటిలో రెండు 13వ అధ్యాయం 1వ వచనంలో రెండు సార్లు వస్తుంది.

ప్రభువు తన శిష్యుల పాదాలను ఎందుకు కడిగాడో మనం అర్థం చేసికోవాలంటే, లేక ఆయన సిలువలో ఎందుకు చనిపోయాడో గ్రహించాలంటే, ఆయన ప్రేమను మనం అర్థం చేసికొనడానికి ఉపక్రమించాలి: "తాను ఈ లోకమునుండి తండ్రియొద్దకు వెళ్లవలసిన గడియ వచ్చెనని యేసు పస్కా పండుగకు ముందే యెరిగినవాడై, లోకములోనున్న తన వారిని ప్రేమించి, వారిని అంతమువరకు ప్రేమించెను" (13:1). యేసు యొక్క కార్యాలను గ్రహించక ముందు, ఆ కార్యాలను పుట్టించిన హృదయాన్ని మనం ఎరుగవలసి ఉంటుంది. ఆయన తన శిష్యుల పాదాలు కడిగినప్పుడు ఆయన హృదయం ప్రేమతో నిండియుంది. కోపముతోగాని, నిరాశతోగాని, విసుగుతోగాని, కలతతోగాని నింపబడియుండలేదు; అది ప్రేమచే నింపబడియుంది. యేసు పరిచర్య చేసినట్టు ఆయనను సేవించగోరితే, మనం కూడా ప్రేమతోనే ప్రారంభించాలి. ప్రభువు చేసినట్టే పరిచర్య చేయాలని నిశ్చయం కలిగినవారు, ప్రేమా హృదయంతో ఆరంభించినట్టు ఆరంభించడానికి వారు యిష్టపడరు.

తరువాత ఈ అధ్యాయంలో, దేవుని రాజ్యానికి కేంద్ర స్థానమైనది ప్రేమయై ఉన్నట్టు ప్రభువు వర్ణించాడు:

> మీరు ఒకరి నొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరి నొకరు ప్రేమింపవలెను. మీరు ఒకనియెడల ఒకడు ప్రేమ గలవారైనయెడల దీనిబట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురనెను (13:34, 35).

అది నిష్కళంకమైన క్రైస్తవ సేవ అయ్యున్నట్టయితే, ప్రేమతో అది ఆరంభించవలసియుంది.

ప్రేమ ఎంతవరకు స్ఫూర్తినిస్తుందో అనేదానికి పరిమితి ఉండదు. దోషారోపణ, భయం, లేక గర్వంతో మనం సేవ చేసినట్లయితే, ప్రేమా హృదయాలతో సేవించిన

దానివలె అది ఉండదు. క్రిష్టియన్ మిషన్ ఆస్పత్రిలో రోగిగా ఒక మనిషి – అక్కడ నర్సులు అతి కష్టమైన, అతి మురికిగా ఉన్న పనులను చేయడం గమనించాడట. "ఒక మిలియన్ డాలర్లకైనా నేను నీ ఉద్యోగం చేయను" అని అతడు ఒక రోజున ఒక నర్సుతో అన్నాడట! తన పనినుండి ఆ క్రైస్తవ నర్సు ఆగి, అతనివైపు ఒక చిరునవ్వు వేసి, "నేను కూడా చేయను!" అని అందట. సేవ చేసేందుకు ప్రేమ కలిగించే అర్పణ మరి దేనివల్లా కలుగదు.

## సేవ అనేది నమ్మికలోనుండి ఉబుకుతుంది (13:2-4)

కొన్ని సంవత్సరాల క్రింద నేను ఆఫ్రికాలో ఉన్నప్పుడు, ఒక రోజు నాతోటి మిషినెరీ ఒక అనువాదకుని ద్వారా క్రైస్తవ సేవ అనే భావనను ప్రాంతీయ భాషలోనికి మార్చించ ప్రయత్నిస్తున్నాడు. తన ప్రసంగంలో, "క్రైస్తవులందరు సేవకులు కావాలి" అనే పాయింటుకు అతడు వచ్చినప్పుడు, "లేదు, నీవు యిలా భావం చెప్పకూడదు" అని అతని తర్జుమా దారుడు అన్నాడట! యేసును గూర్చి అతడు అనేక సంవత్సరాలుగా వినియున్నప్పటికిని, క్రైస్తవులు దాసులుగా మారాలని సువార్తికుడు చెప్పుతున్న మాటలను అతడు నమ్మలేదు.

"సేవించు," "సేవకుడు," "సేవ" – అనే మాటలన్నీ ఏకంగా "బలహీనమైన" పదాలుగా వినిపిస్తాయి. విద్యలేనివారికి, పేదలకు, శక్తి హీనులకు అవి పనులుగా తెలుపుతాయి. సేవ అనేది స్థాయిని పెంచుకోలేనివారికి ఉపయోగింపబడేదిగా సాధారణంగా ఆలోచింపబడుతుంది. సేవ చేయ బలవంత పెట్టబడతాడు గనుకనే ఒకడు సేవ చేస్తాడు.

ప్రభువైన యేసు దీనిని వెనుకకు తిరుగగొట్టాడు. ఆయన తన శిష్యుల పాదాలను కడిగినప్పుడు, ఆయన బలహీనుడో, అధముడో, లేక ఆ పన్నిద్దరిచే మరి ఏ విధంగాను భయపెట్టబడినవాడు కాడు. యోహాను యిలా దాఖలు చేశాడు:

> తండ్రి తన చేతికి సమస్తము అప్పగించెననియు, తాను దేవునియొద్దనుండి బయలుదేరి వచ్చెననియు, దేవునియొద్దకు వెళ్లవలసి యున్నదనియు యేసు ఎరిగి భోజనపంక్తిలో నుండి లేచి తన పై వస్త్రము అవతల పెట్టివేసి, యొక తువాలు తీసికొని నడుమునకు కట్టుకొనెను (13:3, 4).

యేసు చేసినది ఏదో, అది నమ్మికతోను, శక్తితోను ఆయన జరిగించాడు. సేవ అనేది బలహీనతలో కూరుకుపోయింది కాదు, కాని బలం మీద ఆధారపడిందని ఆయన ప్రదర్శించాడు. దేవుని దృష్టిలో క్రైస్తవుడు ఎంతగా ప్రేమించబడి భద్రపరచబడ్డాడో ఆ సత్యాన్ని అతడు నిజంగా గ్రహించినప్పుడు, సేవ చేయడానికి అతనికి ధైర్యం వస్తుంది. తన శిష్యుల పాదాలను కడిగినప్పుడు ప్రభువు దీనిని ఆదర్శంగా నిలిపాడు.

## సేవ అనేది దైవోన్ముఖమైనది (13:1-5)

13వ అధ్యాయంలో ఎక్కువగా కన్పించే యిద్దరు శిష్యులు: యూదా (2, 18–30 వచనాలు) మరియు పేతురు (31–38 వచనాలు). వారిద్దరు తమ పాదాలను ప్రభువుచే కడిగించుకున్నవారే. కొద్ది గంటలలోనే వారిద్దరు ఆయనకు పెద్ద నిరాశగా ఉండబోతున్నారు; యూదా ఆయనను అప్పగిస్తాడు, పేతురు ఆయనను ఎరుగనంటాడు. ఎరుగననే ఈ విషయాన్ని గూర్చి ముందుగా ప్రవచింపబడింది. ఈ "వివరణ" వాస్తవానికి సేవా స్వభావాన్ని గూర్చిన ప్రత్యక్షతయై ఉంది. ఇతరులు మన సేవకు స్పందించిన దానిని బట్టి దాని మంచితనం ఆధారపడియుండదు. మనం సేవ చేయాలి, ఫలితాలను దేవుడు తీర్మానించాలి.

నేను ఏ స్థానిక సంఘంలో భాగమైయున్నానో దానికి "ఆయన యిల్లు" అని పేరుగల పరిచర్య ఉంది. అవసరతలో ఉన్నవారికి అది అన్న వస్త్రాలను యిస్తుంది. కొన్ని సార్లు జనులు మాతో అబద్ధమాడి మా దాతృత్వాన్ని దుర్వినియోగం చేశారు. మా పరిచర్య విలువను అదేమైనా తక్కువ చేస్తుందా? తప్పక చేయదు! మేము జ్ఞానంగా పని చేయాలని ప్రయత్నిస్తాం. మా బహుమానాలు – సారాయి, త్రాగుడు, డ్రగ్స్‌కు ఉపయోగింపబడకూడదని మేము నమ్ముతాం. కొందరు మా పరిచర్యను తమకు అనుకూలంగా చేసికొన్నా, మేము ఆ సేవను కొనసాగించడం అవసరం. యేసు ఆ రాత్రి యూదా, పేతురు అనేవారి పాదాలు కడిగినందున, మనతోటి మానవులకు మనం సేవ చేస్తూ ఉండాలని సూచిస్తుంది. కొన్ని సార్లు ప్రజలు మన సేవను దుర్వినియోగం చేసినా, మన బహుమానాలను పాడుచేసికొన్నా, మన పని మనం చేయవలసిందే. క్రైస్తవులకు సేవనేది ప్రాథమికంగా ఫలితాలను ఎదురు చూచేది కాదు; అది ప్రభువైన యేసు వైపు చూచేదై ఉండాలి!

ఈ సూత్రానికి క్రైస్తవ ప్రచారకులు మరొక ఉదాహరణ. కొందరు శపిస్తారని వాళ్ళు ప్రచారానికి వెళ్లేముందే కొందరు దీనిని నిరసిస్తారని, మరి కొందరు అభిలషిస్తారని కూడా వారికి తెలుసు. వాళ్ల సంచారం ప్రతిఫలాన్ని అపేక్షించదు. ఫలితం ఏదైనా వాళ్ళు చేసేది సరియైన పని కనుక వారు చేస్తారు.

## సేవ అనేది మొదట సేవ చేయబడేదై ఉంది (13:6-10)

ప్రభువు పేతురు వద్దకు వచ్చి అతని పాదములు కడుగ మొదలు పెట్టబోయినప్పుడు, "–ప్రభువా, నీవు నా పాదములు కడుగుదువా?" అని అన్నాడు (13:6). ఆయన నేను చేయుచున్నది ఇప్పుడు నీకు తెలియదుగాని యికమీదట తెలిసికొందువు అని అతనితో అన్నాడు. అయినా పేతురు యింకను అంతరాయం తెలుపుతూ ఆయన తన పాదములు కడుగకూడదని పట్టుపట్టాడు. అప్పుడు ప్రభువు – "నేను నిన్ను కడుగని యెడల నీతో నాకు పాలులేదు" అనగా, దానితో పేతురుకు కలవరం కలిగింది (13:8). ఇది ప్రభువుకు ఎందుకు ప్రాముఖ్యమో అతడు ఎరుగకయున్నా, అది ప్రాముఖ్యమన్న విషయం మాత్రం పేతురుకు అర్థమయ్యింది. పేతురు, ఉద్వేగ పూరితుడిలా కన్పిస్తాడు. గనుక అతడు తన దేహమంతటిని కడుగుమని ఆయనను వేడుకొంటాడు!

దేవునితో మనకున్న బాంధవ్యం విషయంలో స్వయంగా ఆత్మ జ్ఞానాన్ని కలిగి ఉండడం అనేది ఎంతటి వినాశకరమయ్యిందో పేతురుతో ప్రభువు చెప్పిన మాటలు బయలుపరచుతున్నాయి. మన రక్షణను మనం సంపాదించుకొన్నామని మనం ఆలోచించుచు కున్నంత కాలం, దేవునికి కృతజ్ఞత కలిగి వినయంగా ఉండలేం. తత్ ఫలితంగా యితరులకు సేవ చేయాలనే కోర్కెగాని, ఉద్దేశంగాని కలిగియుండం. అలాటి పరిస్థితిలో, మనలను మనకు దేవునిగా చేసికొంటాం! మరోవైపు, దేవుని యొక్క అద్భుతమైన కృపవలన సేవ చేయబడినట్టు మనం గుర్తించినప్పుడు మాత్రమే, మనం కృతజ్ఞతగలవారముగా, వినయంగాను ఉండి, మన రక్షకుని మాదిరిని అనుసరించేవారంగా సిద్ధపడతాం. లక్ష్యపెట్టని సంఘం యితరులకు సేవ చేసేలా ఎలా బుద్ధి పుట్టిస్తుంది? తిట్టడంవలన గాని కలవరం కలిగించడంవలన కాదుగాని, సిలువపై ప్రభువు "తమ పాదాలను కడిగినట్టు" గుర్తు చేయడం ద్వారానే! నిజమైన క్రైస్తవ సేవకు అవసరమైన క్రీస్తు బలివలన సేవను పొందడమే నిజమైన క్రైస్తవ పరిచర్యకు తొలి మెట్టు.

యోహాను సువార్తలో తరచుగా, ప్రభువు చేసిన సంభాషణలో అనేక అర్థాలు ఒకేసారి కలుగుతాయి. 13:1-17లో యిది జరుగుతుంది. మొదటిగా, శిష్యుల పాదాలు కడగడమనేది దయతో కూడిన ఆతిథ్యపు కార్యమైయుంది. ఒకరి దుమ్ము కాళ్లు మరొకని ఎదుటికి రాకుండ భోజనం చేసే గుంపుకు ఆయన ఈ పని చేశాడు. గాఢంగా ఆలోచిస్తే, తాను దాసుని స్వరూపమును ధరించుకొన్నవాడైయున్నట్టు బోధించడానికి ఆయన ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నాడు. అంతేగాక, తన్ను వెంబడించగోరేవారు కూడా సేవకులై ఉండాలని అందులోని సందేశమైయుంది. ఈ సంభాషణలోని భాగంగా, యూదా తన్ను అప్పగించబోతున్నాడని ఆయన సూచించాడు (13:10, 11).

## సేవ అనేది అనుకరించునదై ఉంది (13:12-16)

కలతచెందిన తన శిష్యుల పాదాలను యేసు కడిగిన తరువాత, తిరిగి ఆయన భోజనపు బల్ల వద్ద తన స్థానంలో కూర్చున్నాడు. దాదాపుగా సంకటమైన నిశ్శబ్దం తాండవించియుండవచ్చు. ఆ పన్నిద్దరు ప్రభువు నోటి మాట కొరకు ఎదురు చూస్తూ ఉండవచ్చు. చివరిగా, "నేను మీకు చేసిన పని మీకు తెలిసినదా?" అని ఆయన వారిని అడిగాడు (13:12). ఆయన తదుపరి మాటలు ఆ రాత్రి భోజనపు పరిస్థితికి మాత్రమే గాక, నేడు అవి మనకును వర్తిస్తాయి:

> బోధకుడనియు ప్రభువనియు మీరు నన్ను పిలుచుచున్నారు; నేను బోధకుడను ప్రభువును గనుక మీరిట్లు పిలుచుట న్యాయమే. కాబట్టి ప్రభువును బోధకుడనైన నేను మీ పాదములు కడిగిన యెడల మీరును ఒకరి పాదములను ఒకరు కడుగవలసినదే. నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని. దాసుడు తన యజమానుని కంటె గొప్పవాడు కాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను (13:13-16).

యేసు సేవ చేశాడు! ఆయన మనకు యజమానుడు. గనుక, మనము ఆయనను పోలి ఉండాలంటే యితరులకు మనం సేవ చేయాలి!

ఈ పఠనములో యేసు నామమున సేవ చేసిన "వీరోచితమైన" ఉదాహరణలను నేను వదలివేశాను. ప్రభుని సేవించడం ప్రత్యేక ధైర్యంగలవారికి, ఎక్కువ నైపుణ్యం గలవారికి లేక ప్రత్యేకమైన పరిస్థితులను ఎదుర్కొని సేవచేసిన అనే భావనను నేను కలిగించ జూడలేదు. యేసు మనలనందరిని పిలుస్తున్నాడు (మరియు మనలో ఎక్కువ మందిమి సాధారణమైన జీవితాలను జీవిస్తున్నవారమే). మన యిండ్లలోను స్థానిక సంఘాల్లోను, ఉద్యోగాలలోను లేక మనం ఎక్కడున్నను యితరుల "పాదాలు కడిగే" అవకాశం కొరకు ఆయన మనలను పిలుస్తున్నాడు. క్రైస్తవులైన మనకు అలా చేయడం వింతైన సంగతి కాదు; ఇది కేవలం ప్రభువు యొక్క మాదిరిని అనుసరించే విషయమై ఉంది.

## సేవ అనేది చేయునదై ఉంది (13:17)

ఇరవై సంవత్సరాలకు ముందు నేను యూనివర్సిటీ విద్యార్థినైయుండగా, నేనును నా క్రైస్తవ స్నేహితులును సేవను గూర్చి ఎక్కువగా మాట్లాడుకొంటూ ఉండేవారము. వాస్తవానికి, ప్రభువు తన శిష్యుల కాళ్లు కడగడం అనేది మాకు యిష్టమైన అంశాల్లో ఒకటైయుండేది. మా కుర్ర మూర్ఖత్వంలో ఎన్నడో మరువబడిన క్రీస్తు యొక్క ఉపదేశాన్ని మేము "కనిపెట్టినట్టు" తలంచేవారం. ఇప్పుడు, సంవత్సరాలు గడిచిన తరువాత, సేవ చేసే దానికంటె సేవను గూర్చి మాట్లాడుకొనడం సులభమని నేనును నా స్నేహితులును గుర్తించాం. సేవను గూర్చి "మాట్లాడే మాటల" కంటె ఎక్కువగా చేయాలని ప్రభువు కోరుతున్నాడు. "నడువవలసిన నడకను" నడవాలని ఆయన మనలను ఆహ్వానిస్తున్నాడు. ఇతరులను సేవించడంలో తన మాదిరిని అనుసరించవలసిందిగా ఆయన చెప్పిన తరువాత యేసు యిలా అన్నాడు: "ఈ సంగతులు మీరు ఎరుగుదురు గనుక వీటిని చేసినయెడల మీరు ధన్యులగుదురు" (13:17). ఇదే విషయాన్ని తరువాత కాలంలో యాకోబు యిలా అంటాడు: "మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి" (యాకోబు 1:22).

దక్షిణ ఆఫ్రికాకు చెందిన పదకొండు సంవత్సరాల బాలిక యొక్క ఈ క్రింది కథలో సేవ చేసే ఉదాహరణ యివ్వబడింది. ఆమె ఒక పేద వ్యవసాయదారుని కుమార్తె. ఈ బాలిక పదకొండు సంవత్సరాల వయస్సులోనే ఆమె తల్లి చనిపోయింది. ఆమెయే ఆ యింటి పెద్ద బిడ్డ తన వెనుక యింకా యిద్దరు పిల్లలు ఉన్నందున, ఆమె వెంటనే వారికి "తల్లిగా" మారిపోయింది. ఆమె బాధ్యతలు తలకు మించినవై వాటిని జరిగించడానికి కష్టించి పని చేయడంవలన ఆమె ఆరోగ్యం దెబ్బతిన్నది. చికిత్స కొరకు ఆమె మిషన్ హాస్పిటల్‌కు కొనిపోబడింది. ఆమె హాస్పిటల్లో ఉండగా, ఒక ఉత్తమురాలైన క్రైస్తవ స్త్రీ ఆమెను దర్శింప వచ్చి, "నీవు సంఘానికి వెళ్లతావా?" అని అడిగింది. "లేదమ్మా" అని ఆ పిల్ల బదులిచ్చింది. "నీవు ఎప్పుడైనా సండే స్కూలుకు వెళ్లావా?" అని ఆ స్త్రీ అడిగితే,

మరల ఆ బాలిక, “లేదమ్మా” అని అంది. “నీవు చనిపోయినప్పుడు నీవు దేవునికి ఏమి బదులిస్తావు?” అని ఆ స్త్రీ తిరిగి అడిగింది. తెల్లని శుభ్రమైన వస్త్రం కిందనుండి బలహీనంగా తన చేతులను లాగుకొంటూ, ఆ చిన్న బాలిక యిలా అంది: “అమ్మా, నేను ఆయనకు నా చేతులు చూపుతాను.” ఆమె నిజంగా సేవకురాలే. ఆమె జీవితమును, మాటలును కేవలం సేవను గూర్చి మాట్లాడడం మాత్రమేగాక, సేవ చేయడం ప్రాముఖ్యమై ఉంటుంది!

## ముగింపు

యేసు తన శిష్యుల పాదములు కడగడం ముగించిన పిమ్మట, ఆయన తువాలు తీసివేశాడు, కాని సేవ చేయడం ఆయన ఎన్నడు మానుకోలేదు. మరు దినాన కఠోరమైన రోమా సిలువను ఎత్తుకొని, దానిపై మనకొరకు మరణించ ఇష్టపడ్డాడు. ప్రభువు యొక్క జీవితానికి తువాలును, సిలువయు తగిన గురుతులైయున్నాయి. ఆ రెండును త్యాగమునకు గురుతులైయున్నాయి. అశుద్ధులు శుద్ధి చేయబడవచ్చునని ఆ రెండును గుర్తు చేస్తాయి, మనపట్ల ఆయనకున్న ప్రేమను కనపరచడానికి ఆ రెండును ప్రభువుచే ప్రదర్శించబడ్డాయి, ప్రభువైన యేసు యొక్క మాదిరిని అనుకరించడానికి ఆ రెండును ఆహ్వానిస్తున్నాయి. నీవు నీ తువాలును, సిలువను ఎత్తికొని (మార్కు 8:43) నేడు యేసును వెంబడిస్తావా?

---

సూచనలు

[1]12:1 చూడు. [2]Matthew 20:20-28 and Mark 10:35-45 indicate that the argument over who was “greatest” among the disciples was going on as Jesus and His followers journeyed to Jerusalem.